శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



పరమపావనమైన మీ పాదాలు స్పృశించిన చాలు
ఆపాదమస్తకము పులకించిపోవు!
ఇరులు కరగి మరులు తొలగి
మనములు స్వచ్ఛమైన విరులై
విప్పారి పరవశించి పరిమళించు!
అందుకే మ్రొక్కెదము మీ పాదములకు మనస్ఫూర్తిగా
అంకితము చేసెదము మా జీవితములే హారతులుగా!

# గురుకృప

ఆరాధనోత్సవ సంచిక - గురుపౌర్ణమి 2011

'పథం'లో 'పదాలు'

సంపుటి : 14
జూలై 15

# గురుకృప

గురుపూర్ణిమ సంచిక

సంచిక : 3
2011





## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ

"నా అడుగు జాడలు మీకు శాశ్వతంగా మిగిలి వుంటాయి. మీకే కాదు, రాబోయే తరాలెన్నింటినో తరింపచేయడానికి అవి నిలిచే వుంటాయి."

ఆ పథమెప్పుడూ ఒకటే!
ఆ పథము చూపెడి ఈ పాదమెప్పుడూ ఒకటే!!





గురుపూర్ణిమ - భక్తుని రోజు 3
– గురుకృప

జీవితం 5
– శరశ్చంద్రికలు

ధ్యానం 9
– శరశ్చంద్రికలు

అసమానమైన సాయి మహిమ 13
– శరశ్చంద్రికలు

అనుగ్రహ'ప్రసన్ను'డు 18
– ప్రసన్న

సద్గురువు - శిష్యులు 20
– గురుకృప

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# గురుపూర్ణిమ - భక్తుని రోజు

గురువంటే "మాటల వేదాంతి కాదు- చేతల వేదాంతి" అంటారు శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామివారు. గురువు అంటే 'గురుతు' అన్నారు శ్రీరమణులు. గురువు అంటే నిద్రిస్తున్న దైవాన్ని మేల్కొలిపే, మేల్కొని వున్న దైవం అంటారు శ్రీస్వామిరామ. "మేలు కోరి మేల్కొలిపేవారు గురువు" అన్నారు మాస్టర్ ఇ.కె.గారు. గురువు అంటే ఆనవాలు అన్నారు ఇంకో మహాత్ముడు. గురువు అంటే ఒక ఉదాహరణ అని, గురువు అంటే ఒక ఆదర్శం అని, గురువు అంటే మార్గదర్శి అని, గురువనగా బోధకుడని పలువిధాలుగా దర్శించి, వారి దర్శనానుభూతులను మాటల రూపంలో వ్యక్తపరచి మన అవగాహనకందించే ప్రయత్నం చేస్తున్నారు. నిర్వచించలేనిదాన్ని అవగాహనకు అందించేవారు కనుక గురువుని సమన్వయమూర్తి అన్నది ఈ ఆధునిక ప్రపంచం. గురువు అంటే "మనిషి", "రూపం" కాదు అది తత్త్వం (శక్తి) అంటున్నది "శక్తిమయ" ప్రపంచం. శక్తిలేనిదే పురోభివృద్ధి లేదు అని నమ్మిన శక్తిమయ ప్రపంచం సద్గురువుని అరుదైన శ(వ్య)క్తిగా నిర్వచిస్తున్నది. ఇన్ని విధాలుగా భాషిస్తున్న 'గురు'ని ఏ ఒక్క కోణంలోనూ పరిపూర్ణంగా వ్యక్తపరచలేకపోయింది, ఆధ్యాత్మిక జగత్తు. అందుకే "గురువు-అనంతుడు" అన్నది వేదం. సంస్కృతంలో (దేవభాష) అనాథ అంటే గురువు లేనివారని అర్థం. గురువు లేనివారిని అనాథలుగా, దురదృష్టవంతులుగా చూసేవారు. అందుకే గురువు ప్రతి ఒక్కరికి అవసరం అంటుంది శాస్త్రం.

అనాదిగా అవతారమూర్తులు, కారణజన్ములు... భాగవతులు ఆచరించి చూపుతున్న వైనం - శ్రీరాముడు-విశ్వామిత్రుని, శ్రీకృష్ణుడు-సాందీపుని, శ్రీరామకృష్ణులు-తోతాపురిని, భగవాన్-అరుణాచలేశ్వరుని... (అవతారమూర్తులు), శ్రీవివేకానందులు-శ్రీరామకృష్ణులను (కారణజన్ములు) సేవించి, ప్రహ్లాదుడు-శ్రీహరిని అనుసరణీయమార్గం... గురుపథం. ఇప్పటికీ ఎప్పటికీ అది నిత్య నూతనం, నిరంతర దర్శనీయం... భూమిపైన. ఇప్పటి నా ఈ స్థితికి కారణం నా 'గురువే' (గురుకృపే) అన్నారు శ్రీసాయిబాబా. అన్నింటికీ 'బాబా'నే మనకు 'ఆదర్శం, ఆధారం' అంటారు శ్రీబాబూజీ. 'గురుదేవుల' వైభవాన్ని, విశిష్టతను, ప్రాభవాన్ని-ప్రభావాన్ని, ఆవశ్యకతను-అవసరాన్ని స్మరణీయంగా స్మృతిపథంలో నిలుపుకునేందుకు "గురుపూర్ణిమ" ప్రాశస్త్యాన్ని గుర్తెరగాలి. గురుపూర్ణిమను గురువుల రోజు అంటారు. కాని వాస్తవంగా గురుపూర్ణిమ భక్తుల రోజు అంటారు శ్రీరవిశంకర్. గురువు వద్దకు మూడు రకాలవారు వస్తారు. విద్యార్థి, శిష్యుడు, భక్తుడు.

**విద్యార్థి :** విద్యను ఆర్జించేందుకు వచ్చినవాడు కనుక విద్యార్థి అంటున్నారు. అలా విద్యను (అంతటా వున్నాడని తెలుసుకొనడం - జ్ఞానం) పొంది గురుకులం నుండి బయటకు వెళతాడు. అటువంటి విద్య విజ్ఞానమో, వివేకమో కాదు.



**శిష్యుడు** : శిష్యుడు గురువు మార్గాన్ని అనుసరిస్తాడు. వివేక ప్రాప్తి కోసమో, తన జీవిత పురోభివృద్ధి కోసమో గురువు వెంట వుంటాడు. అంతటా వున్న దాన్ని అనుభూతి చెందడం కోసంగా వుంటాడు. ఇతనికొక ప్రయోజనం, లక్ష్యం ఉండటం చేత తెలుసుకోవడమే కాక తెలుసుకున్న విషయాలను లోతుగా ఆలోచించడం చేస్తాడు. తన జీవిత పరమార్థం కోసం కృషి చేస్తాడు.

**భక్తుడు** : ఇతడు గురువు వద్ద ఉండటం విద్య కోసమో, వివేక ప్రాప్తి కోసమో కాక ప్రేమతో వుంటాడు. ఇవి కలుగునా, కలుగవా అన్న విషయాన్నే అతడు పట్టించుకోడు. కాని అతడు అనుక్షణం దివ్య ప్రేమలో మునిగితేలుతుంటాడు.

విద్యార్థులు పుష్కలంగా, శిష్యులు స్వల్పంగా, భక్తులు చాలా అరుదుగా వుంటారు. భగవంతుడవ్వడమో, భగవంతునిగా వుండటమో గొప్ప విషయమేమీ కాదు. ఒక శిల కూడా దైవం కాగలదు. మీరూ దైవమే. ఈ సృష్టిలో ప్రతి వస్తువు దైవమే. కనుక దైవం ముందే మనం వున్నాం. "Baba is in all directions, so whereever you turn your face Baba only & there is nothing to fear" **- Sri Babuji** కాని భక్తుడవ్వడం చాలా మహనీయం. భక్తి మార్గం చాలా సుందరమైనది, అరుదైనది. విద్యార్థి గురువు వద్దకు కన్నీరు నింపుకొని వస్తాడు. అతను గురువుని వదిలి వెళ్లేటపుడు కళ్లలో నీటిని నింపుకునే వెళతాడు. కాని వాటి తత్త్వం వేరు. అవి కృతజ్ఞతాభాష్పాలు. ఆనందాశ్రువులు. ప్రేమతో విలపించడం, అది చాలా సుందరం. ప్రేమతో విలపించే వానికి భక్తి సమర్పణల అనుభవం ఉంటుంది. అది జరిగినపుడు దానితో సృష్టి అంతా ఆనందిస్తుంది.

శ్రీకృష్ణుడు శరీరాన్ని త్యజించేటపుడు ఉద్ధవునితో ఇలా సంభాషించాడు. "ఈ గోపికలెంతో సౌందర్యవతులు. వారిలోని భక్తి ప్రమాణాన్ని నేను తాళలేకపోతున్నాను. వారే వారి కృతజ్ఞత నుంచి, భక్తి నుంచి నాకు ముక్తినీయగలరని వెళ్లి వారికి చెప్పండి" అని. నేను స్వర్గంలోనో, దైవమందిరంలోనో లేను. నా భక్తులు నన్నెక్కడ కీర్తిస్తారో అక్కడే వున్నానని చెప్పమంటారు.

***భక్తుడనే పుష్ప వికాసం దైవాన్ని సంతసింప చేస్తున్నది కనుకనే గురుపూర్ణిమ భక్తులరోజు*** అనేది.

అనుక్షణం అనుగ్రహిస్తున్న ఓ గురుదేవా! సద్గురురాయా!

మీ 'పద' ఆచరణతో మా 'పద' భక్తిని, మీ పథ అనుసరణతో మా పాద భక్తిని వ్యక్తం చేయాలనే ఆకాంక్షను, ఆశను, ఆశయాన్ని మీ చరణ సన్నిధిన విన్నవించుకుంటున్నాం.

మన ఆలోచనలో, మన ప్రవర్తనలో మన ఆచరణాదులలో మార్పున్నదా? ఈ గమనింపులో మన తీరుని మార్చుకుని ప్రగతిపథంగా చూపిన సాయిపథంలో (అగాధమైన శ్రీసాయిలీలను శోధించి, సాధించి, ఆస్వాదించి అనుభూతి చెందిన అనుభవసాధనా ఫలాలను ఓ పథంగా అదే సాయిపథంగా మలచి



మానవాళికి అందించారు శ్రీబాబూజీ.) మన ప్రయత్నాన్ని సాగిద్దాం. ఈ రోజు నుండి అదే మనం మన దైవానికి మనమర్పించే, సమర్పించే ఎన్నటికీ వసివాడని హృదయ పుష్పారణం...

– గురుకృప

## శరశ్చంద్రికలు

### జీవితం – ఏప్రిల్ 2011

**భక్తుడు :** పారమార్థిక జీవితము, ప్రాపంచిక జీవితము వేర్వేరా? మనం వాటినెలా సమన్వయపరచుకోగలం?

**గురువుగారు :** వాస్తవానికి రెండు జీవితాలంటూ ఏమీ లేవు. నీవు జీవించేది ఒక్క జీవితాన్నే. అది పారమార్థికమా, ప్రాపంచికమా అనే నిర్ణయం నీ లక్ష్యం, నీ గమ్యం, ఇంకా దేని నుండి నీవు నీ ఆనందాన్ని పొందుతున్నావో ఆ మూలకారణం మీద ఆధారపడి వుంటుంది. ఒకవేళ నీవు ఆనందం లౌకిక విషయంగా పొందితే దానిని నీవు ప్రాపంచిక జీవితమనీ, ఇంకా మనము పారమార్థిక కారణాలనుకొనే వాటివలన పొందితే దానిని ఆధ్యాత్మికజీవితమనీ అంటావు. బాబా ఈ రెండింటి మధ్య భేదాన్ని ఎప్పుడూ చూడలేదు. ప్రజలు ఎందుకు ఆరాటపడతారు? ఒక మనిషి ప్రయాసకు ఆధారమేమిటనే నిజమైన మూలకారణాన్ని ఆయన చూచారు. అది లౌకికంగాకానీ, పారమార్థికమైన ప్రయత్నంకానీ అసలు ప్రజలెందుకు ఆరాటపడతారు? అది ఆనందం కోసం, తృప్తికోసం!

సాధారణంగా ప్రాపంచిక విషయాల ద్వారా మాత్రమే ఆనందం వస్తుందని అందరూ అనుకుంటారు. ఒకవేళ, “లేదు లేదు! అది ఆనందం కాదు!” అని ఎవరైనా వాళ్లతో చెప్పినా కూడా వాళ్లు ఇంకా దానిని ఆనందంగానే అనుభవం పొందుతుంటారు. వాళ్లు డబ్బు కావాలనుకొంటారు లేదా వాళ్లకో సమస్య వుంది. అది తీరితేగాని వాళ్లు ఆనందంగా వుండలేరు. నీవొకవేళ, “ఇదంతా మాయ, నిజమైన ఆనందం ఆవల ఎక్కడో వుంటుంది” అని అంటే గౌరవంకొద్దీ వాళ్లు వింటే వింటారేమో కానీ అది వాళ్లకు హృదయగతం కాదు. అదీకాక, అసలు వాళ్లకది నిజంగా అర్థమవదు. కనుక బాబా ఏం చేస్తారంటే మొదట మన కోరికలను తమ శక్తితో తీరుస్తారు. ఒకసారి మన ఆనందానికి బాబా మూలమని తెలిసిన తరువాత మన దృష్టి చిన్నగా అసలు కోరికకు కారణమైన వస్తువు (విషయం) నుంచి ఎవరైతే దాన్ని ఇస్తారో వారి (బాబా) మీదకు



మరలుతుంది.

మనము మన ఆనందాన్ని విభిన్న విషయాల (కారణాల) ద్వారా పొందుతుంటాము. ఎప్పుడైతే ఇవన్నీ ఇవ్వగల సద్గురువనే ఒక ఆధారం దొరికిందో మన మనస్సు ఇంకా ఇంకా ఆయనపై లగ్నం కావడం మొదలవుతుంది. అప్పుడు ఆయనపట్ల మన ప్రేమ పెరిగేకొద్దీ ఇతర విషయాల పట్ల వ్యామోహం చిన్నగా (క్రమంగా) బలహీనపడుతూపోయి ఒక్క సద్గురుని మీదనే మన ఆకర్షణ నిలిచిపోతుంది.

**భక్తుడు** : గురువుగారూ! దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను మనం ఎలా ఒక భాగంగా చేసుకోగలం?

**గురువుగారు :** నీవెందుకు జీవితాన్ని ఆధ్యాత్మికమైనది, ఆధ్యాత్మికము కానిది అని విభజిస్తావు? ఎందుకు ఈ కృత్రిమమైన విభజన చేసి ఒకదానికి ఎక్కువ విలువ, మరోదానికి తక్కువ విలువనిస్తావు? జీవితం జీవితమే. అందుకని మన దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను ఒక భాగం చేసుకోవటమన్న ప్రశ్నేలేదు. సాధన అనేది మన జీవితంలో భాగమవటం కాక మన జీవితమంతా మన సాధనలో భాగం కావాలి. ప్రతిరోజూ ఓ గంట ధ్యానం అని మనం దానికని కేటాయించిన ప్రత్యేకమైన సమయంలోనే కాకుండా రోజుకు 24 గంటలు ఆధ్యాత్మికసాధన సంభవమవ్వాలి. మనకు నేర్చుకోవాలనే అభిలాష వుంటే నిత్య జీవితంలోని ప్రతి సందర్భాన్ని మనము సాధనగా చూడగలం, ఉపయోగించుకోగలం. అది ప్రపంచాన్నంతా గురువులాగా భావించటం, జీవితాన్నంతా గురువుగా చూడటం, ప్రతి విషయంనుంచీ, ప్రతి వ్యక్తినుంచీ నేర్చుకోవటం. అందుకని మౌలికంగా ప్రాపంచికము, పారమార్థికము అనే తేడా ఏమీ లేదు. అదంతా మన స్వభావం (వైఖరి) మీద ఆధారపడుతుంది. ప్రాపంచికమైన ఒకానొక విషయం ఆధ్యాత్మికం కావచ్చు. ఆధ్యాత్మికమైన ఏదో ఒక విషయం ఫక్తు ప్రాపంచికమూ కావచ్చు.

**గురువుగారు :** మీకు ప్రపంచం పట్ల వ్యామోహం వుంది కనుక దానిని మీ ఆధ్యాత్మికగమ్యాన్ని పొందే ఒక సాధనంగా మలుచుకోండి. అప్పుడు ప్రపంచమంతా దానికి (ఆధ్యాత్మిక గమ్యానికి) మార్గమవుతుంది. సాధారణంగా ఒక సాధకునికి ప్రపంచమంతా ఒక అడ్డంకిగా, ఒక శత్రువుగా, ఒక పీడకలగా పరిగణింపబడితే అదే ఒక సాయిభక్తుడికి మాత్రం అతనికి ప్రీతిపాత్రమైన విషయానికి అతనిని మరింత దగ్గరగా తీసుకువచ్చే ఒక సాధనమే అవుతుంది. ఉదాహరణకు మనకు జబ్బు చేసినపుడు చాలా ఆధ్యాత్మికవర్గాలలో దానిని గురించి పట్టించుకోకూడదనుకోవడం జరుగుతుంది. దానికీ మన సాధనకుగానీ, మన సద్గురువుకుగానీ సంబంధం లేదు. "నీవు శరీరం కాదు ఈ జబ్బు గురించి ఆలోచించవద్దు. ఆత్మ మీద మనస్సు లగ్నం చేయి". అని గురువు నీకు చెబుతాడు. కానీ మనము మన అనారోగ్యంతో బాధపడుతూ వుంటాము. అందుకని మనకు మనం "మనం శరీరంకాదు" అని చెప్పుకుంటాం. కానీ అదే సమయంలో



అనారోగ్యం గురించి బాధపడుతూవుంటాం. అందుకని ఒక సంఘర్షణ ఏర్పడుతుంది. కానీ ఒక సాయిభక్తుని విషయంలో అతను జబ్బునపడితే అతనికి నయమవడానికి బాబా దగ్గరకు వెళతాడు. అప్పుడు ఒకసారి అతను తేటపడితే "ఓ! బాబా నాకు నయం చేసారు!" అని అనుకుంటాడు. మామూలుగా ఒక అడ్డంకిలా కన్పించే ఆ శరీరమే, చివరకు జబ్బుకూడా, అతనికి సద్గురువుకు మరింత చేరువకావడానికి సాధనమవుతుంది.

విషయాలను ఈ విధంగా చూడటంద్వారా, మన జీవితమంతా మన సద్గురువుపట్ల మన ప్రేమను వ్యక్తీకరించే విధంగా చేసుకోవచ్చు. అది ఏ మాత్రం లాంఛనప్రాయమైన అలవాటుగా అనిపించకుండా మనలోకి ప్రేమస్ఫూర్తిని ఊపిరులూదే నిరంతరమైన, అనంతమైన (శ్రద్ధతో కూడిన) ఆరాధన నీ జీవితమంతా ఆధ్యాత్మిక సాధనలో భాగంకావాలి అనటంలో నా ఉద్దేశ్యం అదే.

**గురువుగారు :** "కోరికలుండటం మంచిది కాదని, అవి పారమార్థికమైనవి కావ"ని చెప్పి, కోరికలను వదిలిపెట్టమని, కోరికలను త్యజించమని బాబా తన భక్తులను ఎన్నడూ అడగలేదు. ఈ కోరికల పట్ల మనకు గల వ్యామోహాన్ని ఆయన నెమ్మదిగా ఒక పెద్ద వ్యామోహంగా మారుస్తారు. ఉదాహరణకు, ఓ వ్యాపారస్తుడు ఉన్నాడనుకోండి. ఒకసారి అతను బాబా దగ్గరకు వచ్చాక ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు బాబాను ప్రార్థించి తద్వారా అతను విజయం సాధిస్తాడు. కాబట్టి అతని వ్యాపారవిజయం అతనిని బాబాతో కలుపుతుంది. వ్యాపారం అతనిని అతని సద్గురువు నుండి దూరం చేయడం లేదు, నిజానికి అతనికి గల డబ్బు అనే గట్టి వ్యామోహం – ఆ ప్రధానమైన ఆకర్షణ, అతనిని బాబాకు ఇంకా ఇంకా చేరువ చేస్తుంది. కాంట్రాక్టు వచ్చిన ప్రతిసారీ విధిగా బాబా దగ్గరకు వస్తాడు. ఒకవేళ ఏ కాంట్రాక్టు వచ్చివుండకపోతే అసలు బాబా దగ్గరకు వచ్చేవాడు కాదేమో! (గురువుగారు నవ్వుతూ). అసలు పారమార్థికము కాదు అని అనుకునే వ్యాపారం అతనిని పారమార్థికం అని అనబడే దానివైపుకు లాగుతుంది. ఈ పరివర్తన ఎలా తీసుకురావాలో బాబాకు తెలుసు. ఇలాగ అతని జీవితం వ్యాపారం మీద ఆధారపడివుంది. కానీ ఆ వ్యాపారం బాబా మీద ఆధారపడినందువల్ల చివరకు అతని జీవితం సమస్తం బాబా మీద ఆధారపడివుంటుంది. ఈ ఆకర్షణలు, రగులుతున్న కోరికలు ఇవన్నీ అక్కడ ఇక్కడ చెల్లాచెదురుగాపడి మండుతున్న చిన్న చిన్న పుల్లలులాంటివి. బాబా వీటినన్నింటినీ ఒక దగ్గరకు చేర్చి పెద్దజ్వాలగా మార్చాలనుకుంటున్నారు. అదీ మార్గం.

**గురువుగారు :** ఒకసారి తన కోరిక తీరి భక్తునికి ఆ అనుభవం తన సద్గురువు ద్వారా వచ్చిందని తెలిసాక వారిద్దరి మధ్యనుండే ప్రేమానుబంధం భక్తునిలో పరివర్తనకు దారితీస్తుంది. ఇక్కడ లక్ష్యం ఆ కోరిక తీరడం కాదు; పరివర్తన.



**భక్తుడు :** కానీ భక్తుని పరంగా చూస్తే చాలా సందర్భాలలో కోరిక తీరడమే లక్ష్యంగా కనిపిస్తుంది.

**గురువుగారు :** వాళ్లకు అలాగే ఉంటుంది. పరివర్తన కోసం వాళ్లు ఎదురుచూడకపోవచ్చు. కానీ వాళ్ల కోరికలు బాబా తీరిస్తే మాత్రం అది పరివర్తన కోసమే. అది వాళ్లకు తెలియకపోవచ్చు. అది ముఖ్యం కాదు. ఆ అనుభవాన్ని ఇచ్చింది మాత్రం బాబా అని తెలుసుకుంటే చాలు.

**గురువుగారు :** మనకందరికీ ఏదో లేదు అనిపిస్తూ ఉంటుంది. కానీ అదేంటో మనకు తెలియదు,కాబట్టి ఇది ఆనందం ఇవ్వవచ్చు లేకపోతే అది నాకు ఆనందం ఇవ్వచ్చు అని ప్రయోగాలు చేస్తాం. ఏదైతే లేదో దాన్ని తెలుసుకోవడానికి ప్రపంచమంతా ప్రయోగాలు చేస్తోంది, పరిశ్రమిస్తోంది. వివిధ మార్గాలలో ఆధ్యాత్మికత అని పిలువబడేది కూడా ఓ మార్గం. ఆనందం కోసం ప్రయత్నిస్తున్నంతవరకు ప్రతి ఒక్కరూ సాధకులే, అందరూ ఆధ్యాత్మికపథంలోనే ఉన్నారు. అందరూ ప్రయత్నిస్తున్నారు. ప్రయత్నించే పద్ధతి ననుసరించి దారులు వేరవుతాయి. మనిషికి స్వభావరీత్యా ఆనందమనేది ప్రాథమిక అవసరం. అలా కాకపోతే ఆధ్యాత్మికతకు అర్థం లేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి డబ్బు కోసం కష్టపడుతున్నాడనుకుందాం. డబ్బు ఎందుకు? ఆనందం కోసం. అధికారం ఎందుకు? ఆనందం కోసం. సంబంధ బాంధవ్యాలు, స్నేహితులు ఎందుకు? ఆనందం కోసం. వేలకొలది రకరకాల మార్గాలున్నాయి. ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారు..... ప్రయత్నిస్తున్నారు.....ప్రయత్నిస్తున్నారు.

ఆనందం కోసం సమస్త ప్రపంచం ప్రయత్నిస్తోంది, పరిశ్రమిస్తోంది. మానవులంతా ప్రయత్నిస్తున్న ఈ లక్షలాది పద్ధతుల్లో – ఇప్పటికీ ఇంకా ఇంకా ఆవిష్కృతమవుతున్నటువంటి వాటిల్లో – మన మార్గంలో మనమూ ప్రయత్నిస్తున్నాం. ఈ మార్గంలో ప్రయత్నించడం వల్ల బహుశ మనం ఏదో పొందుతాం. అది మహాత్ములు ప్రవచించినటువంటి, ఇతరత్రా దేనిమీదా ఆధారపడనటువంటి ఓ ఆనందం. ఆనందం కోసం తపించడం అన్నది మానవుని సమస్య. మానవనైజమైన ఆ సమస్యకు మాత్రమే మనం ప్రతిస్పందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ కూడా. ప్రత్యేకమైనటువంటి పద్ధతుల్లో పరిష్కరించుకోవడానికి ఇదేదో మనకు మాత్రమే గల ప్రత్యేకమైనటువంటి సమస్య కాదు. అది అసాధారణమైన రోగమేమీ కాదు. అది ఒక సామాన్యమైన బాధ. మార్గాలే వేరు. కొన్నింటిని ఆధ్యాత్మికమని, కొన్నింటిని ప్రాపంచికమని ముద్రవేసారు. నేను మనుషులందరికీ ఉండే ప్రాథమికమైన తపన గురించి మాట్లాడుతున్నాను. ***ఆనందానికి అందరూ అర్హులే. అందరూ సమర్థులే.*** అందరూ అన్వేషిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆ అన్వేషణ కొనసాగిస్తే, ***అన్వేషణలో నిజాయితీ ఉంటే అందరూ దానిని తప్పక పొంది తీరుతారు.***




# ధ్యానం - మే 2011

**గురువుగారు :** ధ్యానం అంటే మనకు ప్రీతికరమైన విషయం పట్ల గల మన ప్రేమను, మన వాంఛితాన్ని అభివ్యక్తీకరించడం మరియు అనుభవించడం. ఉదాహరణకు నేను సత్సంగం తరువాత గది నుండి బయటకు వెళ్లి పోయాక మీరంతా నిశ్శబ్ధంగా కూర్చుంటారు. సహజంగా మనసుకు వచ్చే మాటల అవసరం అప్పుడు ఉండదు. సత్సంగం నుండి మీరు కొన్ని పదాలను, కొన్ని భాగాలను ఇలా ఏదో గ్రహించి ఉంటారు. అది మేథాజనితసిద్ధాంతంగాని, భావనలుగానీ, ప్రబోధాలుగానీ కాదు. మనస్సు ఆలోచించడానికి నిరాకరిస్తుంది. అది మగ్నమవుతుంది, అది లయిస్తుంది, అది తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. మీరు అంతరంగంలో ఆనందాన్ని అనుభవిస్తూ మూతబడిన కన్నులతో అలా కూర్చుండి పోతారు. ఆ ఆనందానుభవమే ధ్యానం.

**భక్తుడు :** గురువుగారూ! తీవ్రమైన ధ్యానం అంటే ఏమిటి? అందులో ఆలోచనలు ఎటువంటి పాత్రను పోషిస్తాయి?

**గురువుగారు :** ఏ పారవశ్యమైన అనుభవంలో మనం మన (హృదయ) కలశం అంచులవరకు పూర్ణంగా నిండిన అనుభూతిని పొందుతామో అది తీవ్రమైన ధ్యానం. ఆ పూర్ణత్వ అనుభవం వలన మనం అసలు ఆలోచనలు తలెత్తుతున్నాయా లేదా అన్న విషయం కూడా పట్టింపులేని స్థితికి చేరుకుంటాం. మన ధ్యాసంతా ఆ అనుభవం మీద నిలిచి ఆలోచనలు పూర్తిగా తమ ప్రాధాన్యతను కోల్పోతాయి. ఒకవేళ ఆలోచనలు తలెత్తినా ఆ అనుభవం మీద నుండి మనల్ని మరల్చగలిగేటంత శక్తి వాటికుండదు.

**గురువుగారు :** మనలోని ప్రేమోద్వేగాన్ని జాగృతం చేయడమే ధ్యానం యొక్క ప్రధానోద్దేశ్యం. మనలో ప్రేమ జాగృతమైనప్పుడు నిజమైన ధ్యానం మొదలవుతుంది. ధ్యానమంటే మనిషిని ఏ ఆలోచనలు లేకుండా, భావోద్వేగాలు లేకుండా, నిరాసక్తంగా, ఉదాసీనంగా, స్తబ్ధంగా, శిలలాగా మార్చేది కాదు. ధ్యానమంటే శిలను మనిషిగా మార్చడం. భావోద్వేగాలను ఒక క్రమపద్ధతిలో పెంపొందించుకొని సమన్వయం చేసుకుంటే అవి జీవితంలో ఉపయుక్తమైన వ్యక్తీకరణను పొందుతాయి. ఓ భావోద్వేగం బలమైనదైతే మిగతావన్నీ సహజంగా దానితో ఇమిడిపోతాయి. మనస్సును శూన్యంగా ఉంచుకోవడం ధ్యానం కాదు. ధ్యానమంటే జీవితపు మధురిమలను ఆస్వాదించడం అంతేకాని జీవితం నుండి తప్పించుకోవడం, జీవితానికి నిన్ను నువ్వు దూరంగా చేసుకోవటం కాదు. జీవితం ఎంతో సహజమైనది. ఒకవేళ నీవు ప్రపంచం నుండి తప్పించుకోవాలనుకొంటే, అది నిజం నుంచి తప్పించుకోవాలనుకోవడమే. అంతేకాదు, మనం అనుభవించలేకపోతున్నదేదో జీవితంలో ఇంకా ఉంది కనుక, ధ్యానంలో ఆ భాగాన్ని కూడా నీవు



అనుభవంలోనికి తెచ్చుకోగలవు. దాన్ని సత్యాన్వేషణ అనవచ్చు. కానీ ఆ అన్వేషణలో మిగతా జీవితాన్ని శూన్యమని, మాయ అని తిరస్కరించవద్దు. అలాకాక జీవితంలో పాలుపంచుకోండి, జీవితాన్ని ప్రేమగా అక్కున చేర్చుకోండి.

**గురువుగారు :** మనలో అస్పష్టంగా ఉండే సంపూర్ణత్వభావనను విస్పష్టం చేసుకోవడానికి మనం చేసే కృషికి ధ్యానం ఓ వ్యక్తీకరణమైనపుడు శ్రద్ధ దానంతటదే వస్తుంది, ఆసక్తి దానంతటదే వస్తుంది. మనకు లక్ష్యం పట్ల ప్రేమ వున్నప్పుడు దాని ఒకానొక పర్యవసానం లేదా లక్షణం శ్రద్ధ. మందకొడిగా, నిరాసక్తంగా కూర్చుని గడియారం వంక చూస్తూ సమయాన్ని గమనించడం – ఇది కాదు శ్రద్ధ. శ్రద్ధాసక్తులు వున్నప్పుడు రెండు మూడుగంటలు మీరు కూర్చున్నా గడియారాన్ని గమనించరు.

**భక్తుడు** : గురువుగారూ! ధ్యానానికి కూర్చున్నపుడు ఏదైనా పద్ధతిని అనుసరించాలా?

**గురువుగారు :** అవసరం లేదు! అలా కూర్చుని దానిలోని ఆనందాన్ని అనుభవించండి. అసలు ఆ ***ఆనందాన్ని అనుభవించడమే నిజమైన ధ్యానం.*** ఒకవేళ మనస్సు చంచలంగా ఉంటే, మీకు నచ్చిన మార్గాలలో బాబా మీద లగ్నం చేయడానికి ప్రయత్నించండి. అది బాబా నామస్మరణ కావచ్చు లేదా బాబా గురించి చింతన చేయడం కావచ్చు... ఇలా ఏదైనా సరే. నీవు ధ్యానం చేస్తున్నావన్న ఎఱుకలో కూడా లేనటువంటి సమయమాసన్నమవడమే సరైన ధ్యానమంటే. అదెలా ఉంటుందంటే – నీకు బాగా ఆకలి వేస్తున్నది. చుట్టుప్రక్కలెక్కడా రెస్టారెంట్ లేదు. రెస్టారెంట్ దొరికేవరకు దానికోసం అక్కడకు, ఇక్కడకు పరిగెత్తి, చివరకు దానిని కనుగొని ఆహారాన్ని ఆవురావురమని తింటావు. తినిన తరువాత నీకు ఎలా అనిపిస్తుంది? “ఆహా! భలే రుచిగా ఉంది” అంటావు. నీకు ఎంతో తృప్తిగా అనిపిస్తుంది. అప్పుడు “ఆహా! ఇప్పుడు ఓ  కునుకు తీయాలి అనిపిస్తుంది”. ఆ పరిపూర్ణమైన తృప్తిని అనుభవించడం వలన అప్రయత్నంగా మీ కళ్ళు మూతబడి తీసే కునుకులాంటిది – నిజమైన ధ్యానమంటే.

**భక్తుడు** : గురువుగారూ! మనస్సు బాబా మీద లగ్నం చేయలేక, ఆ ఆనందానుభూతి పొందలేకపోతే ఏం చేయాలి?

**గురువుగారు :** మనస్సును బలవంతపెట్టకుండా, నీకు వీలైన మార్గంలో ఆలోచించి నీవు ఆరాధించే నీ లక్ష్యంతో (బాబాతో) బంధమేర్పరచుకోవడానికి ప్రయత్నించు. నీకు పరిపూర్ణతను, ఆనందానుభూతిని ఇచ్చేది ఆ అనుబంధమే కనుక ఆ బంధాన్ని కలిగించేది ఏదైనా సరే దానిని ఇంకా ఇంకా చెయ్యి. నీ లక్ష్యమే నీకు అనుభవాన్నిస్తుంది. ఆనందం దాని స్వభావం – అది బాబా యొక్క స్వరూపం. ఒకసారి బాబాను పొందాక ఇక ఏ ఇతర సాధనలు అవసరం లేదు. కానీ ఎల్లవేళలా ఆయనను పొందడం




సాధ్యపడదు. చాలాసార్లు మనము దానిని (ఆ ఆనందాన్ని) అనుభూతి చెందం. అందుకని అలాంటి సందర్భాలలో ఆయనతో అనుబంధమేర్పరచుకోవడానికి మనకు మనమే స్వంతమార్గాలను ఏర్పరచుకోవాలి.

**గురువుగారు :** బాబా(ను) ఎంతగానో ప్రేమిస్తారు కాబట్టి, నాలాంటివాళ్ళు ఆయనకేసి అలా చూస్తుండటాన్ని ఇష్టపడతారు. ఎప్పుడూ ఆయన ఊసులో, ఆయన ధ్యాసలో గడపడాన్ని ఇష్టపడతారు. అది మినహా వారు మనఃపూర్వకంగా మరేదీ చేయలేరు. ఆయన సాంగత్యాన్ని కాంక్షిస్తారు కాబట్టి వారు తదన్యమైనదేదీ చేయలేరు. వీరికి తమ ప్రేమ-ధ్యానించడం కోసమో, మననం చేసుకోవడానికో లేక నామం చేసుకోవడానికో - ఇలా ఏదో చెయ్యడానికి చేసే ప్రయత్నమో, మార్గమో కాదు. వాళ్లకు ఇవన్నీ ఓ లక్ష్యాన్ని సాధించడానికి చేసే ఆధ్యాత్మిక సాధనామార్గాలు కావు. వాళ్ల ప్రేమకు వ్యక్తీకరణలు మాత్రమే. ఆధ్యాత్మికసాధనలన్నీ అలాగే జరగాలి. నా అభిప్రాయమిది.

ఇంకా మనం బాబా నుండి పొందే ఆ చరమలక్ష్యమైన ఆ పూర్ణత్వం నేరుగా వీటిమీద ఆధారపడిలేదు. "నువ్వు నాపై నాలుగు గంటలు ధ్యానం చేసావు కాబట్టి నీకు ఆనందాన్ని ఇస్తాను" అని ఉండదు. ప్రత్యక్షంగా దీనికి దానికి ఎటువంటి సంబంధం లేదు. ఎందుకంటే వారికది ఏదో పొందడానికి చేసే సాధనం కాదు, బాబా పట్ల వాళ్లకుగల ప్రేమకు సహజమైన వ్యక్తీకరణ మాత్రమే; తాము స్వీకరించడానికి సిద్ధమైన తక్షణం బాబా ఇస్తారని వారికి తెలుసు.

**గురువుగారు :** మనలో ప్రేమ ఉన్నంతవరకు ధ్యానం సహజంగా జరుగుతుంది. అప్పుడు ఓ గంటసేపు అలా కూర్చుని బాబాకేసి చూడడం మాత్రమే కాకుండా రోజులో మనం చేసే ప్రతి పని మన ప్రేమను అభివ్యక్తీకరిస్తుంది. ఆ ప్రేమను వ్యక్తీకరించడానికి చాలామార్గాలున్నాయి; ఉన్న మార్గాలలో ధ్యానం కూడా ఒకటి. మనం చేసే ప్రతి పని మనలోని ప్రేమానుభవాన్ని వ్యక్తీకరిస్తున్నప్పుడు ప్రతిదీ ధ్యానంలో భాగమే అవుతుంది.

**గురువుగారు :** మీరు దృష్టిని బాబాపై కేంద్రీకరించి నిశ్చలంగా ఇరవైనాలుగు గంటలూ కూర్చుని వుండలేరు కనుక మీకు ఇంకా ఏదో కావాలి. విచలితం చేసే విషయవాసనలు మరియు ఆకర్షణలు చాలా వున్నాయి కాబట్టి శరీరానికి కొంత పని అవసరం. క్రమేణా ఈ విషయవాసనలన్నింటిని ఒక క్రమపద్ధతిలోనికి తీసుకొనివచ్చి చివరకు మనం చేసే పనులు బాబాకు సంబంధించి ఉండేటట్లు చేయడమే దీనికి పరిష్కారం. కాబట్టి ఆ పని చేస్తున్నంతసేపు మనం ఆయన గుర్తింపులో వుంటాం. ఇంకా ఆయనను స్మరించుకుంటూ, బాబా కోసం చేస్తున్నాం, బాబాకు చేస్తున్నాం అన్న సంతృప్తిని అనుభవిస్తాం. మనస్సు కాస్త కుదుటపడ్డాక



మళ్లీ అలా కూర్చుని వీలైనంతసేపు ఆ ఆనందాన్ని అనుభవిస్తాం. కాసేపటి తరువాత మళ్లీ మనస్సు చంచలమవడం ప్రారంభమవుతుంది. అప్పుడు మళ్లీ కొంత పని అవసరమవుతుంది. ఈ విధంగా చేస్తూ పోవడం ద్వారా ధ్యానం మరియు నిశ్చలంగా కూర్చునే సమయాలు ఎక్కువవుతూ ఇక ధ్యానం నుండి బయటకు రావాల్సిన అవసరం లేని స్థితికి చేరుకుంటాం. అసలు కదలటమే అవసరం లేనపుడు (ధ్యానంలో) కూర్చున్నా లేక (ధ్యానం నుంచి) లేచినా అది పట్టించుకోవాల్సిన విషయం కాదు. అప్పుడు రెండూ ఒకటే.

కానీ ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే, చాలామంది ధ్యానంలో ఏం చేస్తున్నాం అనే విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకుంటారు. కానీ వెలుపల ఏం చేస్తున్నాం అనే విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. వాళ్లే తరువాత, “మేం గత రెండు, ఐదు లేదా పది సంవత్సరాలుగా ధ్యానం చేస్తున్నాం, జపం చేస్తున్నాం, కానీ ఏమీ జరుగలేదు” అని అంటారు. దీనికి కారణం ఏమిటంటే వాళ్లు ధ్యానసమయంలో ఏమి చేస్తున్నారో దాని గురించి మాత్రమే జాగ్రత్త వహిస్తున్నారు. కానీ నేను చెప్తున్నాను... నువ్వు ధ్యానంలో చేసేటటువంటి దానిని నిలబెట్టేది, చెడగొట్టేది నిర్ణయించేది లేదా మార్చేది మాత్రం నువ్వు ధ్యానానికి వెలుపల ఏంచేస్తున్నావో అది. సాధారణంగా ప్రజలు దానిని గురించి జాగ్రత్త వహించరు. ధ్యానానికి వెలుపల ఏమి చేస్తున్నాం అనే విషయంపై దృష్టిపెడితే, నువ్వు ధ్యానంలో పెద్దగా శ్రమించాల్సిన అవసరమే ఉండదు. ధ్యానం సహజంగా సిద్ధిస్తుంది. ఇంకా ఇంకా బాబాను కేంద్రంగా చేసుకోవడం ద్వారా రోజంతా మీ నిత్యకృత్యాలను అర్థవంతంగా, సంతృప్తిగా ఉండేలా ప్రయత్నించండి. అలా చేయండి!! అప్పుడు ధ్యానానికి ఎలా కూర్చుంటారో, ఆ అనుభవం ఎలా ఉంటుందో చూడండి.

**భక్తుడు** : మనం నిజంగా ధ్యానిస్తున్నామా లేక ఊరికే కళ్లుమూసుకుని కూర్చొనున్నామా అని ఎలా తెలుసుకోవడం?

**గురువుగారు :** నువ్వు ఫలాన్ని బట్టి చెట్టును నిర్ణయిస్తావు. నువ్వు ధ్యానానికి వెలుపల ఏం చేస్తున్నావో అనే విషయమే నీకు తెలియజేస్తుంది, వేరే పరీక్షలేవీ అవసరంలేదు. నీ ముంజేతిని చూడటానికి నీకు అద్దం అక్కరలేదు. నీ రోజువారీ జీవితంలో ఏం చేస్తున్నావో అనే దానినిబట్టి నీ ధ్యానం ఎంత నాణ్యమైనదో కనిపిస్తుంది.

**గురువుగారు :** మనం గమ్యాన్ని చేరుకునేంతవరకు ధ్యానం చేయడం, ప్రపంచంలో పనిచేయడం రెండూ సాధనే అవుతాయి. ధ్యానాన్ని మీరు కళ్లు మూసుకుని కూర్చునే సమయం వరకే పరిమితం చెయ్యకండి, ఎందుకంటే అది మీ జీవితంలో ఓ భాగం మాత్రమే. జీవితమంటే అది మాత్రమే కాదు. ధ్యానాన్ని మీ



జీవితంలో ఒక భాగం చేసుకోవడమే కాకుండా మీ జీవితం మొత్తాన్ని మీ ధ్యానంలో భాగం చేసుకోండి. అది ఎలా? బాబా "నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు. అది నీకు సాధ్యపడకపోతే, (ఇక్కడ నీవు) రోజూ చూసే నా యీ రూపాన్ని ధ్యానించు" అని అన్నారు. ఆయన తొలి ప్రాధాన్యత మాత్రం జీవితపు మధురిమ, జీవితసారము అయిన ఆనందమే. ఏదైనా విషయాన్ని మీరు ఆస్వాదిస్తున్నప్పుడు ధ్యాన లక్షణాలన్నీ సంప్రాప్తమవుతాయి. మంచి రుచికరమైన పదార్థాలను రుచి చూస్తున్నపుడు మన కళ్లు ఎందుకు మూతపడతాయి? ఎందుకంటే మనం దానిని సంపూర్ణంగా సంతృప్తిగా ఆస్వాదిస్తున్నాం- మనం సంతోషంగా వున్నాం. నేను మిమ్మల్ని జీవితం యొక్క రుచిని ఆస్వాదించమని అడుగుతున్నాను. జీవితపు మాధుర్యాన్ని రుచిచూడడం ద్వారా కలిగే ఆనందాస్వాదనమే ధ్యానం. అదీ నిజమైన ధ్యానం.

## అసమానమైన సాయి మహిమ - జూన్ 2011

**గురువుగారు :** అందరూ బాబాను అద్భుతలీలలు చేసే వ్యక్తిగా భావిస్తారు. కానీ ఆయన ఎన్నడూ దేనినీ సృష్టించలేదు (ఇంద్రజాలం చేయలేదు). అటువంటి వాటిని ఆయన చమత్కారాలు అన్నారు. ***"నేను చమత్కారాలు చేయన"***ని స్పష్టంగా తెలిపారు కూడా.

***భక్తుడు*** : మరి ఈ మానవాతీత చర్యలను ఆయన ఏమని పిలిచేవారు?

**గురువుగారు :** ఆయనకు సంబంధించినంతవరకు అది తల్లి తన బిడ్డలను సంరక్షించడంలాంటిది. మీరు వాటిని మహిమలని పిలుస్తామంటే ఫరావాలేదు. బిడ్డకు ఆకలివేసిన వెంటనే తల్లి ఎదనుండి పాలు వస్తాయి. అది ఒక అద్భుతం కాదా? బిడ్డకు పాలు అవసరమైనంతవరకు స్రవించి అవసరం (ఆకలి) తీరిన మరుక్షణం వాటంతటవే తగ్గిపోతాయి. ప్రతి తల్లి చేసే అద్భుతమే ఇది. ప్రతి బిడ్డ అనుభవమిది. ఇది చాలా సహజం. వీటి (మహిమల) పట్ల బాబా అనుభవం కూడా ఇలాగే వుంటుంది, చాలా సహజంగా.

***భక్తుడు*** : కానీ వీటితో మన అనుభవం అలా వుండదు కదా! అలా అనుభూతి చెందుతామా?

**గురువుగారు :** అందుకే దానిని అద్భుతమంటున్నారు. నేను దానిని సహజసిద్ధమైన మాతృసంరక్షణ అంటాను. అనురాగమయి అయిన తల్లిలా ఆయన మన గురించి జాగ్రత్త తీసుకుంటున్నారు. ***మీరు మహిమ అని పిలిచేది సాయిబాబా వంటి సద్గురువులకు స్వాభావికమైన తల్లి సంరక్షణ లాంటిది.***

***భక్తుడు*** : బాబా జీవితంలో మనం చాలా అద్భుతాలు చూస్తాం. వాటికి ఆయా వ్యక్తుల అవసరాలు తీర్చడమే కాకుండా మరే ఇతరమైన ఉద్దేశ్యం వుందా...?



**గురువుగారు :** దాదాపు బాబా చేసిన ప్రతి లీల ఆ అనుభవం పొందిన వ్యక్తిలో పరివర్తనకు దారితీసేటటువంటి ప్రభావశీలతను కలిగి వుంటుంది. ఇతర మహాత్ములలో ఇది చాల అరుదు. బాబా దగ్గర జరిగిన మహిమలు లేదా మానవాతీతం అని పిలువబడే చర్యలు ఓ పరివర్తనను తీసుకొచ్చే బోధను కలిగివుండేవి. దీనిని కొంత వరకు బాబా జీవిత చరిత్రలో చూడవచ్చు. ఊరికే బాబా వద్ద అద్భుత లీలలను అనుభవించిన ఆ భక్తులలో ఎవరో ఒకరి స్థానంలో అలా మిమ్మల్ని ఊహించుకొని చూస్తే, మీరూ దానిని గమనించవచ్చు.

ఈ విధంగా బాబా జీవితచరిత్ర అంతా ఆయన ప్రబోధం. నిజానికి ఆయన ముఖతా వెలువడిన ప్రత్యేకమైన బోధంటూ ఏమీలేదు. బాబా తమ చర్యల ద్వారా బోధించారు. ఇక చమత్కారాల విషయానికి వస్తే అవి అనుభవించే వ్యక్తి మనస్సును దిగ్భ్రమకు గురిచేస్తాయి. కానీ బాబా వద్ద జరిగే ఆ అద్భుత లీలలు ప్రబోధాత్మకంగా ఉండేవి. ఉదాహరణకు బాబా దగ్గరకు ఎవరైనా ధనం కోసం వస్తే వారికి ఊరికే అలా ఇచ్చేయడమో లేక 'ఫలానా చోటకు వెళ్ళు. అక్కడ ధనం దొరుకుతుంది' అని చెప్పడమో, లేక ఎవరో ఒకరు వచ్చి వారి చేతిలో డబ్బులు పెట్టడమో ఇలాంటివి జరగవు. ఆ ఏర్పాటు చాలా సహజంగా జరిగితే ఎలా ఉంటుందో అలా చేస్తారు బాబా. కానీ అనుభవం పొందే వ్యక్తికి అంతకుమించింది ఏదో ఉందని తెలుస్తూ ఉంటుంది.

ఉదాహరణకు బొంబాయిలో ఒక కాటన్ మిల్లులో పెద్ద మేనేజర్‌గా పనిచేస్తూ క్రమం తప్పకుండా శిరిడీ వచ్చే భక్తుడున్నాడు. ఒకానొక సందర్భంలో అతనికి యాజమాన్యంతో విభేదాలు తలెత్తి తన ఉద్యోగానికి రాజీనామా సమర్పించి నిరుద్యోగిగా వున్నాడు. ఇలా సుమారు సంవత్సరం గడిచింది. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి అతని జీవనం కష్టసాధ్యమయ్యింది. అతను ఒకరోజు "నేను సమయాన్ని వృథా చేస్తూ బొంబాయిలో ఏం చేస్తున్నాను? కనీసం శిరిడీకన్నా వెళ్ళి మళ్ళీ ఏదైనా ఉద్యోగం వచ్చేదాకా బాబా సన్నిధిలో రెండు మూడు నెలలు ఉందాం" అని నిశ్చయించుకున్నాడు.

దుర్భరమైన పేదరికాన్ని అనుభవిస్తున్నటువంటి ఆ సమయంలో అతను శిరిడీ వచ్చాడు. అతను మశీదులోకి అడుగుపెడుతూ ఉండగానే బాబా, "ఆవో, సేఠ్ ఆవో (ధనవంతులని సేఠ్ అంటారు)" అని ఆహ్వానించారు. ఆ పిలుపుకు ఆ వ్యక్తి కించపడ్డాడు. తనలో తాను, "నన్ను ఓ సేఠ్ (ధనవంతుడా) అని పిలిచి, బాబా కూడా నా పేదరికాన్ని అవహేళన చేస్తున్నారు. ఇప్పుడు నేను సేఠ్‌ను కాదు" అని అనుకుంటూ వెళ్ళి మసీదులో కూర్చున్నాడు. బాబా అతనిని "నీ కార్యక్రమం ఏమిటి" అని అడిగారు (గురువుగారు నవ్వుతూ), దానికి అతను "బాబా నేను ఇక్కడ రెండు మూడు నెలలు ఉండాలనుకుంటున్నాను" అని



చెప్పాడు. "లేదు, బొంబాయికి వెళ్లు" అని చెప్పి, "తక్షణం బొంబాయికి బయలుదేరు" అన్నారు. ఆ మనిషి దిగ్భ్రాంతికి లోనయ్యాడు. "నేను ఇప్పుడే వచ్చాను, అంతలోనే బాబా నన్ను వెళ్లిపొమ్మంటున్నారు! బాబా కూడా డబ్బున్నవాళ్లనే పట్టించుకుంటారు. నేను పేదవాణ్ణి కాబట్టే బాబా నన్ను ఇక్కడ వుంచదలచలేదు" అనుకున్నాడు. అప్పుడతను "సరే బాబా! మీ ఆదేశానుసారం నేను వెళతాను" అని చెప్పాడు. తరువాత అతనికి బాబా ఊదీ ఇస్తూ నిర్దిష్టంగా "పూనా మీదుగా వెళ్లు" అని చెప్పారు. సామాన్యంగా ఎవరూ బొంబాయికి పూనా మీదుగా వెళ్లరు. అది హాస్యాస్పదంగా వుంటుంది. ఎందుకంటే అది పూర్తిగా విరుద్ధమైన మార్గం. కానీ బాబా "ఈ మార్గంలో బొంబాయికి వెళ్లు" అని చెప్పారు. అలా ఆ వ్యక్తి పూనా వెళ్లాడు.

రైలు దిగీ దిగగానే అతనికి ఒక కాటన్‌మిల్లుకు యజమాని అయినటువంటి ఒక వ్యక్తి తారసపడి ఇతనితో, నేను ఇప్పుడే నీ గురించి ఆలోచిస్తున్నాను అని చెబుతాడు. అతని మిల్లులో ఓ నెల రోజుల నుండి మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ ఉద్యోగానికి సరైన వ్యక్తి ఎవరా అని ఆలోచిస్తూ వున్నాడు. మిల్లు యజమానికి ఈ వ్యక్తి ముందే తెలుసు. ఇతనైతే ఆ ఉద్యోగానికి సరిపోతాడు అనుకుంటాడు. కానీ మిల్లు యజమాని దగ్గర ఇతని చిరునామాకాని, ఇతరత్రా వివరాలు ఏవీ లేకపోవడంతో అతనిని సంప్రదించడం ఎలాగో తెలియక ఊరుకుంటాడు. కానీ అంత రద్దీగా వున్న రైల్వేస్టేషన్‌లో ఇతను దిగిన క్షణం ఆ మిల్లు యజమాని సరిగ్గా అక్కడ వుండటం అప్పుడే అతనిని చూడటం జరిగాయి. "నేను మీ కోసమే చూస్తున్నాను! మీరు ఇప్పుడు ఏం చేస్తున్నారు?" "నేను ప్రస్తుతం ఖాళీగా వున్నాను" "అయితే మా మిల్లులో పనిచేయడానికి అంగీకరిస్తారా?" "తప్పకుండా, సంతోషంగా". "సరే మీరు రేపు బొంబాయికి రండి, నేనప్పటికి బొంబాయికి చేరుకుంటాను" తరువాత ఇతను బొంబాయికి వెళ్లి, ఉద్యోగంలో చేరాడు. వాస్తవానికి అతను సేఠ్ అయ్యాడు. ఇదంతా ఒక్కవారంలో జరిగిపోయింది. మీరు ఇదంతా కేవలం యాదృచ్ఛికం అనుకుంటున్నారా, బాబా అతనికి ఊరికే "ఇంటికి వెళ్లు!" అని చెప్పివుండి, ఇతను కాటన్‌మిల్లు యజమానిని బొంబాయిలో కలుసుకునుంటే అది వేరే సంగతి అయివుండేది. కానీ బాబా ఉద్దేశ్యపూర్వకంగా "పూనా మీదుగా వెళ్ళు!" అని చెప్పారు. వీరిద్దరూ రైల్వేస్టేషన్‌లో కలవడం జరిగింది. ఆ వందలమంది మధ్యన క్షణకాలంలో ఒకరినొకరు తప్పిపోవడానికి అవకాశం వున్నప్పటికీ, అంతా పథకం ప్రకారం జరిగినట్లుగా ఖచ్చితంగా ఇతను దిగిన భోగీకి ఎదురుగానే ఆ మిల్లు యజమాని వున్నాడు. ఆ భక్తుడు ఎలా అనుభూతి చెంది వుండవచ్చో ఆలోచించండి. కేవలం సాయిబాబా తనకు ఉద్యోగమిచ్చారు అనే అనుభవంతోపాటు ఈ మొత్తం విషయం ఎంత అద్భుతంగా రూపుదిద్దుకుందో అనే అనుభవాన్ని కూడా పొందుతాడు.



**గురుపుగారు :** సాయిలీలలు ఎక్కడా ఆకాశం నుండి ఊడిపడే అద్భుతాలుగా జరగవు. మన చుట్టూ వున్న వ్యక్తుల ద్వారానే ఆయన యొక్క దయ, కరుణ, రక్షణ అత్యంత సహజంగా అందుతుంది. 'బాబా! డబ్బు అవసరం చాలా వుంది, చాలా కష్టాలలో వున్నాను!" అని బాబాకు చెప్పుకున్నాము. బాబాకు నైవేద్యం పెట్టి నిద్రపోయి లేచేలోపున – బాబా దిండుక్రింద లక్షరూపాయలేమీ ఉంచరు. ఆ సమయానికి ఎవరో వచ్చి 'ఈ రకంగా చేస్తే మీ సమస్య పరిష్కారం అవుతుంది' అని చెపుతాడు. మనం ఆ విధంగా చేస్తే అన్నీ కలిసొచ్చి, పరిస్థితులు అనుకూలంగా మారి, అవసరం తీరుతుంది. బాబా అలా చేస్తారు తప్పితే ఇంద్రజాల మహేంద్రజాల టక్కుటమార విద్యలేవీ ప్రదర్శించరు. ఇదే బాబా లీలలోని ప్రత్యేకత. బాబా రక్షణ, అనుగ్రహం ఆకాశం నుండి ఊడిపడడమంటూ ఏమీ ఉండదు. ఏం జరిగినా–అది తోటివ్యక్తి నుండి, సాటి జీవులనుండి, మన చుట్టూ వున్న పరిస్థితుల నుండి జరుగుతుంది. ఆయన లీల ఎందుకలా వుంటుందంటే, అన్నింటిలోనూ అందరిలోనూ ఉండేది, మాట్లాడేది బాబా అనే విషయం మనకు గుర్తింపులోకి రావడానికి, ప్రాపంచికమైన వ్యవహారాలే కాదు, ఆధ్యాత్మికమైన సమస్యలైనా అంతే. అందుకే ఆయన ***"నాకు వారసులెవరూ లేరు. నన్నాశ్రయించినవారికి నా సమాధి నుండే సమాధానమిస్తాను"*** అని చెప్పారు.

**గురుపుగారు :** మనకి ఆధ్యాత్మిక సమస్య వచ్చింది. ధ్యానంలోనే ఒక సందేహం వచ్చింది. బాబా! దీనికి పరిష్కారం ఏమిటి? అని – మనస్ఫూర్తిగా, ఆర్తితో ప్రార్థిస్తే – ఎవరో దారిన పోయే దానయ్య దానికి సమాధానం చెప్పిపోతాడు. ఆ చెప్పివెళ్లేవాళ్లకే మనకు జవాబిస్తున్నట్లుగ, మనకు మేలు చేస్తున్నట్లు తెలియదు. కానీ మన సమస్య మాత్రం పరిష్కారం అవుతుంది.

బాబా దేహంతో ఉన్ననాడు కూడా ఇలానే జరిగేది. ఎవరైనావచ్చి వేదాలలోనో, ఉపనిషత్తులలోనో ఒక ప్రశ్న వేసారనుకోండి. బాబా స్వయంగా సమాధానం చెప్పేవారు కాదు. ఏ హరికథ జరిగే చోటుకో, ప్రవచనం జరిగే చోటుకో వెళ్లి వినమని చెప్పేవారు. అక్కడకు వెళ్లి కూర్చోగానే బాబాను అడిగిన ప్రశ్నకు సరిగ్గా సమాధానం వచ్చేది. ఆ ప్రవచనం చేసే వాడికి బాబా ఫలానా మనిషిని ఫలానా ప్రశ్నతో పంపిస్తాడు అనే విషయమేమైనా తెలుసా? ఇంకొక తమాషా ఏమిటంటే బయలుదేరినవాడు నేరుగా అక్కడకు వెళ్లవచ్చు. మధ్యలో టీ త్రాగవచ్చు. మరేదైనా పని చూసుకొని వెళ్లవచ్చు. ఎట్లయినా వెళ్లనీ ఎప్పుడయినా వెళ్లనీ వీడు వెళ్లేటప్పటికి అప్పుడే వీడి ప్రశ్నకు జవాబు మొదలవుతుంది. ఆ టైమ్ కేలిక్యులేషన్ చూడండి!

**గురుపుగారు :** నేను పూండీకి వెళ్లకముందు వేదశాస్త్రాలనన్నింటినీ విపరీతంగా చదివేవాడిని. వాటిల్లో పుణ్యక్షేత్రాల సందర్శనాన్ని మరియు తీర్థాల మహిమను ఎంతో గొప్పగా వర్ణించేవారు. నాకో సందేహం



కలిగింది. మహాత్ములు ఎందుకు క్షేత్రాలను దర్శించేవారు? పరిపూర్ణత్వాన్ని పొంది తమ చరమలక్ష్యాన్ని చేరుకున్న మహాత్ములకు తీర్థాలకు వెళ్లవలసిన అవసరమేముంది? పురాణాలలో ఎందరో మహాత్ములు తీర్థాలను, క్షేత్రాలను సందర్శించుకోవడం చూస్తాం. వాళ్లకు అలా చేయవలసిన అవసరం ఏముంది? వారికి పవిత్రత వృద్ధి పరచుకోవాల్సి అవసరముందా? అంతకుమించిన పవిత్రత ఏముంది? లేక వారి పవిత్రతకు మెరుగులు దిద్దుకోవాల్సిన అవసరం ఉందా? (గురువుగారు నవ్వుతూ) ఎందుకని?

నేను ఓ రోజు ఆరుబయలు ప్రదేశంలో వున్నప్పుడు దీనిని గురించి వివిధ శ్లోకాలలో, పురాణాలలో చెప్పబడిన వివిధ ఉదంతాల గురించి ఆలోచిస్తున్నాను. ఇంతలో హఠాత్తుగా పెద్దగా గాలి వీచింది. అప్పుడు ఎవరో వేరుశనగకాయలో లేదా మరేదోపొట్లాంకట్టి వాడిపడేసిన బాగా పాతదైన కాగితం ఒకటి అలా ఎగిరివచ్చి నా ముఖానికి తాకింది. నేను దానిని తీసుకుని విప్పి చూసాను. అది నారదభక్తి సూత్రాలలోని ఒక పేజి. సరిగ్గా అదే పేజిలో గల సూత్రంలో నారదుణ్ణి ఒకరు, "మహాత్ములు పుణ్యక్షేత్రాలను ఎందుకు దర్శిస్తారు"? అని ప్రశ్నిస్తున్నారు. దానికి నారదుడు "పుణ్యక్షేత్రాలను మరింత పవిత్రం చేయడానికి మహాత్ములు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు" (గురువుగారు నవ్వుతూ) అని సమాధానమిస్తాడు. అదీ శ్లోకం!! అప్పుడనుకున్నాను ***"బాబా తలచుకుంటే మనం ఎక్కడున్నా సమాధానం ఇవ్వగలరు"*** అని. అందుకే మీరు ఎప్పుడైనా "ఏంటి గురువుగారు మీరు దూరంగా వెళ్లిపోతున్నారు, మేము ఏం చేయాలి" అని అంటే, నేను ఎప్పుడూ చెబుతూ వుంటాను... "చింతవద్దు, బాబా మహిమాన్వితులు, మీకు మీ సమాధానాలు లభిస్తాయి".

***భక్తుడు*** : కొందరు మహాత్ములు చేసిన విధంగా సాయిబాబా తాత్వికమైన ప్రబోధాలు చేయలేదు కదా! చేసారా?

**గురువుగారు :** లేదు, లేదు ఆయన నుండి ఎవరూ అటువంటి వాటిని ఆశించలేదు. వాళ్లు ఆయన దగ్గరకు వెళ్లిన మరుక్షణం మహిమను చవిచూసారు. తమ అసహాయత ఎఱుకలోకి వచ్చి ఆయన సహాయం అర్థించి దానిని పొందారు. ఆ సహాయం పొందే క్రమంలో వారికి బోధ కూడా అందేది. కాబట్టి మీరు చూసే ప్రతి లీల, ప్రతి సంఘటన, ప్రతి మహిమ, మీరు చదివే ప్రతి అనుభవం ఓ సందేశాన్ని తెలియచేస్తుంది. కొంతమంది ఇతర మహాత్ములు అదే సందేశాన్ని వాచా బోధించారు. (బాబా సాన్నిధ్యంలో) పూర్ణమైన సంతృప్తిని పొందడం వలన బాబా వాచా బోధించలేదని ఎవరూ కొరతగా భావించలేదు. దాని కోసం (బోధ) కొరతలేదు. మన అసహాయతను తొలగించుకొని, ఆ ఆనందానుభూతిని పొందడానికి బోధ అవసరమవుతుంది. కానీ బాబా సన్నిధిలో ఆనందానుభవం దానంతటదే అనుభవమయినపుడు మిగతా వాటి అవసరమేముంది?



# అనుగ్రహా'ప్రసన్న'డు

గురుదేవులు సమర్ధ సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ పాద పద్మములకు నమస్సుమాంజలి. నేను 1995లో మొదటిసారిగా ఆర్తిగా నాకు ఇది కావాలి అనే కోరికతో (మిషతో) సాయిబాబా గుడికి వెళ్లాను. అప్పటి నుండి నా జీవితంలో ఉన్న ప్రతి సంఘటనలోను బాబాని ప్రార్ధిస్తూ ఆయన ఆశీస్సులతో జరుగుతూనే వున్నాయి. ఒక ఫ్రెండ్ ద్వారా 2008లో గురువుగారి గురించి తెలిసింది. తరువాత 2009 విజయదశమి రోజున నేను అమెరికాలో వున్నందున ఇంటర్‌నెట్ ద్వారా గురువుగారిని దర్శించుకున్నాను. ఒక మంచి అనుభూతి కలిగింది. 2009ఆగష్టులో కన్నెక్టికట్‌లో ఒక స్నేహితులని ఇంట్లో మొదటిసారిగా సత్సంగంలో పాల్గొన్నాను. ఒక మంచి అనుభూతి కలిగింది. మావారి ఉద్యోగరీత్యా ఫిలడెల్ఫియా రావడం జరిగింది. నేను కూడా జాబు కోసం ప్రయత్నిస్తున్నాను. అప్పుడు www.saiseekers.com వెబ్‌సైట్ ద్వారా అక్కడ సత్సంగం జరుగుతుందని తెలుసుకొని వారికి ఫోన్ చేసాను. నాకు ఇంట్రస్ట్ ఉంది నేను వస్తానని. అది రాజశ్రీగారి ఇల్లు. గురువారం రాత్రి 7 గం.లకి సత్సంగం. పెద్దగా ప్రాక్టీసు లేని డ్రైవింగ్. అయినా వెళ్లేది బాబా దగ్గరకే కదా అని ఒక్కదాన్నే బయలుదేరి వెళ్లాను. దారి తప్పినా, పెద్ద ఇబ్బంది ఏమీ పడకుండా సత్సంగానికి వెళ్లగలిగాను. అక్కడ చూసిన బాబా పటం, గురువుగారు బాబా పాదాల దగ్గర ఉంటారు. నా మదిలో అలా ఉండిపోయింది. నా శరీరంలో ఏదో తెలియని ప్రకంపన. అక్కడ ఉన్నంతసేపు చాలా ఆనందంతో గడిపాను. తొమ్మిది గంటల సత్సంగం అనంతరం ప్రసాదం తీసుకొని, బాబాని తలచుకుంటూ ఇంటికి వచ్చేసాను. అపుడు కలిగింది గురూజీ మీద భక్తి, శ్రద్ధ. ఇంటర్‌నెట్‌లో చాలా చదివాను. అలా 'గురుకృప' గురించి తెలుసుకొని చదవడం మొదలుపెట్టాను. భక్తుల అనుభవాలు చదువుతుంటే అద్భుతం అనిపించింది. అంతలోనే మళ్లీ గురువారం వచ్చేసింది. ఈసారి అమ్మను తీసుకొని వెళ్లాను. అక్కడ కూర్చున్నంతసేపూ మళ్లీ అదే ఆనందం. ఏదో తెలియని దివ్యానుభూతి. ఆరోజు గురువుగారి ముందు కూర్చుని అడిగాను, మళ్లీ వారం వచ్చేసరికి నాకు ఉద్యోగం రావాలని. అలా ప్రార్ధించి వచ్చేసాను. మరుసటి రోజు శుక్రవారం, ఏమీ ముందుకు జరగలేదు. కాకపోతే అంతకు ముందు వారం రోజుల క్రితం ఒక కంపెనీ వాళ్లు కాల్ చేస్తే, మావారికి, నా ఇద్దరి పిల్లలకి ఫ్లూ జ్వరం అని, నేను ఇంటర్వ్యూ చేయలేనని చెప్పాను. ఫీవర్ కావడంతో నేను సరిగా ప్రిపేర్ అయ్యే టైమ్ కూడా లేదు. సోమవారం ప్రొద్దున్నే మళ్లీ వాళ్ల నుండి ఫోన్ వచ్చింది. నేను ఇంకా నిద్ర లేవలేదు. నా నిద్ర గొంతు విని, అతనే చెప్పాడు, పది గంటలకు చేస్తాను రెడీగా ఉండమని, మొదటి రౌండ్ ఇంటర్వ్యూకి. సరే అని లేచి కూర్చున్నాను. 10.30 ని॥లకు కాల్ చేసి స్క్రీనింగ్ చేసి, మంగళవారం మెయిన్ ఇంటర్వ్యూ అని చెప్పారు. అలా మెయిన్ ఇంటర్వ్యూకి ఫోన్ ద్వారా హాజరయ్యాను. బుధవారం



పర్సనల్ ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు. న్యూయార్క్ వెళ్లాలి. బాబా మరియు గురువుగార్లకు చెప్పి బయలుదేరాను. బాబా–గురువుగార్ల అనుగ్రహంతో ఇంటర్వ్యూ బాగానే చేసాను. గురువారం వచ్చేసింది. సాయంత్రం 3.30 అయిపోయింది. నేను సత్సంగానికి వెళ్లడానికి కారు కావాలి, మావారు ఆఫీసు నుండి ఫోన్ చేసారు. "నీకు కారు ఇవ్వడానికి నేను ఇంటికి వస్తున్నాను"అని. ఏదో లేచి రెడీ అవుతున్నాను కానీ ఉత్సాహం లేదు. అప్పుడే ఫోన్ వచ్చింది. నా ఉద్యోగం ఖరారు అయ్యిందని. నా ఆనందాన్ని ఊహించుకోగలరు. వెంటనే హుషారుగా బయలుదేరి, సత్సంగానికి వెళ్లాను. తొందరగానే వెళ్లాను. సంతోషంతో రాజశ్రీ గారికి విషయం చెప్పాను. చాలా సంతోషించారు. చాలా తక్కువ సమయంలో ఉద్యోగం రావడం కేవలం బాబా అనుగ్రహం అని అందరం అనుకున్నాం.

అలా నా మొదటి కోర్కె కేవలం ఒక్క వారంలోనే తీర్చారు. నిజం చెప్పాలంటే బాబా నా కోర్కెలని తీరుస్తూనే వున్నారు. 1995 నుండి నేను తెలుసుకోలేకపోయాను అనిపించింది. అలా నా కోర్కె వారంలోనే తీర్చినా, నేను నా అనుభవం రాయడానికి ఒక సంవత్సరం పట్టినందుకు సిగ్గుపడుతున్నాను. అలా అని నన్ను బాబా–గురువుగారు మర్చిపోలేదు. వారి అనుగ్రహం నామీద కురిపిస్తునే వున్నారు. ఆ తరువాత గురువారం సత్సంగాలకు వెళ్లడం కుదరలేదు. కానీ ప్రతి శనివారం రామ్ & మధు వాళ్లింట్లో జరిగే సత్సంగానికి అటెండ్ అవుతూ ఉన్నాను. ఇదిలా వుంటే మా బాబు 4 సం॥లు అయినా మాటలు సరిగా రావడం లేదు. ఇండియాలో స్పెషలిస్టులు అందరికీ చూపించాము. ఆరోగ్యరీత్యా అంతా బాగానే ఉంది అన్నారు. యుఎస్‌లో చూపించాము. సర్జరీ చేయాలి అన్నారు. అందుకని అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకొని, డబ్బు కూడా కట్టాము. బుధవారం సర్జరీ.


ఎప్పటిలానే శనివారం సత్సంగ్‌కి వెళ్లి మధుగారితో చెప్పాను. ఇలా మా బాబుకి సర్జరీ అన్నారని. బాబా మరియు గురువుగారు వుండగా సర్జరీ ఎందుకు, లెటర్ వ్రాసి గురువుగారి ఫోటో క్రింద పెట్టండి అని చెప్పారు. అలా లెటర్ రాసి ఫోటో కింద పెట్టి వచ్చాను. బాబా ఊదీని నీళ్లలో కలిపి త్రాగించారు. సోమవారం హాస్పిటల్ నుండి ఫోన్ చేసి, సర్జరీ ఇన్సూరెన్స్‌లో కవర్ కాదని, 10,000 డాలర్లు కట్టాలని. అలా అప్పటికి సర్జరీ వాయిదా వేసాము. వేరే డాక్టర్ దగ్గరకు వెళ్లాము. మా బాబుని టెస్ట్ చేసి అసలు సర్జరీ అవసరం లేదని చెప్పారు. చైల్డ్ డెవలప్‌మెంట్ టెస్ట్‌కి తీసుకువెళ్లాము. 13% డీవియేషన్ ఉంది కనుక బిడ్డ పరిస్థితి సాధారణమే అన్నారు. నిర్ణీత సమయానికంటే ముందుగా పుట్టిన పిల్లలలోఇది సాధారణమని డాక్టర్లు చెప్పారు. అమ్మతోపాటు ఇండియాకి పంపాను. అక్కడ మళ్లీ టెస్ట్‌లు చేసి, సర్జరీ అవసరం లేదని చెప్పారు. కేవలం ఒక నెల స్పీచ్ థెరపీతో నార్మల్‌గా మాట్లాడుతున్నాడు.



ఇలా రాస్తూ పోతే ఈ ఒక్క సంవత్సరంలోనే ఆయన నా మీద కురిపించిన అనుగ్రహం, ఇచ్చిన అనుభవాలు చాలానే ఉన్నాయి. అలా ఆరు నెలలు అదే జాబులో ఉంటూ, వేరే జాబు ట్రై చేద్దామనుకున్నాను. కాని, గురువుగారు తొందరపడవద్దు, నీకు మారవలసి వచ్చినపుడు నేను చెప్తాను అన్నారు. అలా అదే జాబ్ కంటిన్యూ చేస్తున్నాను. సంవత్సరం అయిపోయింది. కంపెనీ మారదామనుకున్నాను, అంతలో ఏదో ఫోన్ కాల్. టెలిఫోన్ ఇంటర్వ్యూ అంటూ, సరే గురువారం చేస్తాను అని చెప్పాను. బాబా చూసుకుంటారులే అన్న నమ్మకంతో, నా వంతు నేను బాగానే ప్రిపేర్ అయ్యాను. మళ్లీ వారం పర్సనల్ ఇంటర్వ్యూ. శృతి అనే అమ్మాయి కాల్ చేసి అడ్రస్ ఇచ్చింది. క్లైంట్ ఎవరు అని అడగకుండా వెళ్లాను. ఎందుకంటే ఇది నేను అప్లై చేసిన జాబ్ కాదు. ఆయన ఇవ్వాలనుకున్న జాబ్ అంతే. అంతా సవ్యంగా జరిగి జాబ్‌లో చేరిపోయాను. నేను కోరుకున్నది సత్సంగాలకు వెళ్లాలని. అలాగే దగ్గరగా జాబ్ వచ్చింది. మళ్లీ కంటిన్యూ చేస్తున్నాను. ఇలా నా జీవితంలో ప్రతి అడుగు బాబా ఆశీస్సులతో జరుగుతుంది. గురువుగారి సాయిభక్తి సాధనా రహస్యం, ఆయన సత్సంగాలలో భక్తుల సందేహాలను, సమాధానాలను అవలోకించుకుంటూ మన అందరం బాబాకి ఇష్టమైన మార్గంలో పయనించేలా చేయాలని గురుదేవులను కోరుకుంటూ... ***– ప్రసన్న, అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి***

## సద్గురువు - శిష్యులు

రామకృష్ణుల సన్న్యాస శిష్యులలో అగ్రగణ్యుడు స్వామి వివేకానందుడు. శ్రీరామకృష్ణులు ఆయన మహాసమాధి చెందకముందే నరేంద్రుడిని (స్వామి వివేకానందను) మిగతా శిష్యులకు నాయకుడిగా ప్రకటించారు. దానితో శిష్యులందరూ రామకృష్ణుల నిర్యాణానంతరం కొద్దికాలంపాటు తీవ్రదుఃఖంలో కూరుకుపోయినప్పటికీ తరువాత తేరుకొని నరేంద్రుడి ప్రేరణదాయకమైన నాయకత్వంలో, మార్గదర్శకత్వంలో గురుదేవులు సదా తమతోనే ఉన్నారని, వారు తమను నిత్యం గమనిస్తున్నారని గ్రహించి ఆధ్యాత్మిక సాధనలు తీవ్రతరం చేసారు. గృహస్థ భక్తులలో అధిక సంఖ్యాకులు కూడా అప్పుడప్పుడు బారానగర్‌లోని సన్న్యాస శిష్యుల నివాసానికి వచ్చి వారి భౌతికావసరాలను సమకూరుస్తూ వారిలో భగవదావేశాన్ని చూసి స్ఫూర్తిని పొంది వారి శాయశక్తుల ఆధ్యాత్మిక సాధనలను చేయడానికి ప్రయత్నించేవారు. నిజానికి సద్గురువులెవరూ మరణించరు. వారు దేహాన్ని త్యాగం చేసి తదనంతరం కూడా తమ శిష్యులను, భక్తులను సదా ఆధ్యాత్మిక పథంలో నడిపిస్తుంటారు. ఈ విషయంలో ఎలాంటి సందేహానికీ తావులేదు. శిష్యబృందాలకు, భక్త బృందాలకు వారి గురువులపై ప్రగాఢ విశ్వాసం ఉండాలి.



రామకృష్ణుల శిష్యవర్గం మధ్య చక్కటి సోదర భావం ఉండేది. ఒకరికొకరు పరస్పరం సహాయం చేసుకుంటూ, త్యాగం చేసుకుంటూ సదా గురుదేవులను స్మరిస్తూ వారు ఒక చక్కటి ఆదర్శాన్ని జిజ్ఞాసువుల ముందుంచారు. ఒక ప్రక్కన శాస్త్రాధ్యయనం, మరో ప్రక్క జపధ్యానాలతో వారు నిరంతరం భగవంతుడే ఆలంబనగా జీవించారు. వారి భగవదావేశం ఎంత తీవ్రంగా ఉండేదో, వారి మధ్యలో ప్రేమానురాగాలు ఎంత గాఢంగా ఉండేవో రామకృష్ణుల శిష్యులలో ఒకరైన స్వామి ప్రేమానంద వారి మాటల్లో, 'బారానగర్‌లో మేమందరమూ తీవ్రతపశ్చర్యా జీవితాన్ని గడిపాము. మేము అప్పుడు నిత్యావసరాలకు కూడా నోచుకోని దుస్థితిలో ఉండేవారం. వండటానికి బియ్యం ఉంటే ఉప్పు కొనడానికి కూడా డబ్బుఉండేది కాదు. కాని, తిన్నామా, లేక పడుకున్నామా? అని కూడా మేము పట్టించుకునేవారం కాము. గంటలకొద్దీ ధ్యానంలోను, ఇతర ఆధ్యాత్మిక సాధనలోనూ కాలం గడిపేవారం. భగవంతునిలో లీనమవుదామన్నదే మా అందరి ఆకాంక్ష. రామకృష్ణానంద స్వామి మఠ నిర్వహణ బాధ్యతను స్వీకరించి, మా అందరినీ చూసుకుంటూ రోజుకు కనీసం ఒక్కసారైనా మేము భోజనం చేసేలా చూసేవారు. ఆ రోజుల్లో వారి మధ్య ఉన్న ప్రేమానురాగాలను గురించి స్వామి శివానంద ఈ విధంగా వ్యాఖ్యానించారు, 'మాకు ఒకరిపట్ల ఒకరికి ఎంత తీవ్ర ప్రేమ ఉండేదంటే ఒకరికోసం మరొకరం ప్రాణం ఇవ్వడానికి సిద్ధంగా ఉండేవాళ్లం'.

రామకృష్ణుల శిష్యవర్గంలోని వారి మధ్య పరస్పర ప్రేమ, సహకార భావం చక్కగా నెలకొని వుండేవి. అందరూ ముముక్షువులు, ఒకే లక్ష్యంతో ముందుకు సాగుతున్న వారు కాబట్టి ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటూ ఆధ్యాత్మిక సాధనలను అనుష్టించేవారు. నిజానికి భగవంతుడిని ఏకాంతంలో ఉపాసించడమనేది ఉత్తమోత్తమైనది. కానీ ఈ కలియుగంలో ముఖ్యంగా గృహస్థులుగా ఉన్నవారికి నిరంతర సత్సాంగత్యం అవసరం. మహామాయ మోహ ప్రభావం అతి తీవ్రంగా ఉండే ఈ కలియుగంలో ఏకాంతంలో సాధనలను అనుష్టించడం చాలా కష్టం. కాబట్టి భగవంతుడిని చేరుకోవడమే జీవిత లక్ష్యంగా ఉన్నవారు కొందరు కలసి ఒక గురువు సాన్నిధ్యంలో, మార్గదర్శకత్వంలో భక్తి వైరాగ్యాలను పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలి. ***సద్గురువునెప్పుడూ కేవలం మానవమాత్రునిగా భావించకూడదు. భగవంతుడే తమను వుద్ధరించడానికి మానవాకారం ధరించాడని భావించి భక్తిభావంతో మసలుకొన్నవారికి శీఘ్రంగా భగవల్లబ్ధి చేకూరుతుంది.*** విశ్వాసం కొద్దీ ఫలం ఉంటుంది.

శ్రీరామకృష్ణుల శిష్యులందరికీ గురుదేవుల మీద అచంచల భక్తి ఉండేది. గురుదేవుల ప్రేమ మాధుర్యాన్ని వారు భౌతికంగా వారి మధ్యలో ఉన్నప్పుడు గ్రోలి వున్నవారు కాబట్టి వారికి గురుదేవులు




తమతో ఉన్నారన్న విషయంపై సందేహాలు వచ్చేడివి కావు. ఒకసారి బేలూరు మఠంలో ఒక యువసన్యాసి రామకృష్ణుల సన్యాస శిష్యులలో ఒకరైన స్వామి బ్రహ్మానందను 'మహారాజ్ శ్రీరామకృష్ణులు ఇప్పుడు కూడా ఉన్నారా అని అడిగాడు. అప్పుడు మహారాజ్ ఈ విధంగా సమాధానమిచ్చారు. 'నీకు అసలు బుద్ధి లేనట్లనిపిస్తుంది. ఇల్లు–నీడా వదలి ఇటువంటి వైరాగ్య జీవితాన్ని ఎందుకు గడుపుతున్నావు?' ఆయన ఎల్లప్పుడూ వున్నారు. దర్శనం ప్రసాదించమని ఆయనను రాత్రింబవళ్లూ ప్రార్థించు. నీ సందేహాలన్నింటినీ పారద్రోలి తన నిజతత్త్వాన్ని నీకు అర్థమయ్యేటట్లు చేస్తారు'. మనకు కావలసింది శ్రద్ధ, విశ్వాసం, వ్యాకులత, భగవంతుడిని చేరుకోవాలన్న ఆర్తి, ఆవేదనతో కూడుకున్న ప్రార్థన -- ఇవి సాధకుడికి ముఖ్యంగా వుండవలసిన లక్షణాలు. ఇవి ఉంటే భగవంతుడిని చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.


కావున జిజ్ఞాసువులందరూ ఈ లక్షణాలను పెంపొందించుకొని కైవాల్యానుభవాన్ని కోరుకోవాలి. ఎక్కడ కోరిక వుంటుందో అక్కడ రాముడుండడు. ఎక్కడ రాముడుంటాడో అక్కడ కోరిక ఉండదు అంటాడు భక్త తులసీదాసు. విషయవస్తువులలో చిక్కుకున్న మనస్సు భగవంతుడిని ధ్యానించలేదు. భగవంతుడిపై నిలిచిన మనస్సు విషయ వస్తువులపైకి వెళ్లలేదు. మనం రెండూ కావాలనుకుంటే సాధ్యపడదు.

***సద్గురువును మానవమాత్రుడిగా భావించినవారు భౌతికంగా గురువు తమకు దూరమైనపుడు ఎడబాటును భరించలేక తీవ్ర భావోద్వేగాలకు గురి అవుతారు. సాధనను కుంటుపరచుకుంటారు. సద్గురువులందరూ ఆత్మస్వరూపులే. ఆత్మకు చావుపుట్టుకలుండవు కాబట్టి సద్గురువులందరూ శాశ్వతానంద స్వరూపులే. వారు నిత్యం మన మధ్యనే ఉండి మనకు మార్గదర్శనం చేస్తూనే ఉంటారు. మనకు ఈ విషయమై పూర్తి విశ్వాసముండాలి. వారి నిజతత్త్వాన్ని ఎరుగని వారే గురువులు తమకు దూరమయ్యారనుకుంటారు.*** రామకృష్ణుల శిష్యబృందంలోని వారు సదా రామకృష్ణులు తమతో ఉన్నారని తమను అన్ని విధాల సంరక్షిస్తూ, సదా మార్గ నిర్దేశం చేస్తూనే ఉన్నారని విశ్వాసం కలిగి ఉండేవారు. వారి జీవితాలలో అనేకసార్లు అనేక సంఘటనల ద్వారా రామకృష్ణులు వారికి కనబడి, ఆపదలు కలిగినపుడు రక్షించి, వారి సందేహాలను పటాపంచలు చేస్తూ వారిని ఆధ్యాత్మిక జీవితంలో శిఖరాగ్రాలకు చేర్చారు.

**ముముక్షువులందరూ తమతమ గురువులపై అచంచల విశ్వాసాన్ని కలిగి వుండి కైవల్య శిఖరాన్ని అధిరోహింతురు గాక!**

*(రామకృష్ణ మఠం, హైదరాబాద్ వారి సౌజన్యానికి గురుకృప సదా కృతజ్ఞతలు తెలుపుతున్నది.)*


బాధ కలిగిన బాధ తీర్చును... బోధ యడిగిన బోధ చేయును...
బరువు యనినచో బరువు దించును... దారి కోరిన దారి చూపును...
ఏమి కోరక అంకితమైనచో అన్నియు తానై నిలచును... అన్నిట తానై నడిపించును
అందుకే మ్రొక్కెదము మీ పాదములకు మనస్ఫూర్తిగా
అంకితము చేసెదము మా జీవనములే హారతులుగా!
– శ్రీ మోపిదేవి కృష్ణస్వామి


అడుగుజాడల్ని అనుసరించడమే మన కర్తవ్యం
అదే మనకు రక్ష!